# డేవిడీ దేవత

'బావలు సయ్యా... సై మరదలు సయ్యా.... సై...' అర్ధరాత్రి కాబోతుంది. నగరం పడిబొడ్డున ఐదు నక్షత్రాల హోటల్ హెవెన్. హెవెన్ నట్టనడుమ.. కస్టమర్ల మనోరంజనం కోసం కలగా పులగం కార్యక్రమాలు. ఆకర్షణ కోసం కోడెవయసులున్న దొరచూపుల కవ్వింపులు, దొంగాటకాలు. నాట్యమయూరిగా పరిచయమైన ఊర్వశి మెరుపు పెదాల నేపథ్య గీతాన్ననుసరిస్తున్నాయి.

కాళ్లూ చేతులు గంతులేస్తున్నాయి. గుమ్మగా కనబడాలనే రమ్ము బాబుల ఆరాటానికనుగుణంగా ఒంటిమీది గుడ్డలు నామ మాత్రమైనాయి. పాట పారుతూనే ఉంది.

వారుణి వాహినిలో కొట్టుకొచ్చి వేదిక చుట్టూ మూగిన కస్టమర్ల ఆకలి చూపులు ఊర్వశి నడుముకున్న మూరెడు, ఛాతీని చుట్టుకున్న బారెడు గుడ్డల మీదున్నాయి. జోరుగా, హుషారుగా వినిపిస్తున్న నేపథ్య గీతాని కనుగుణంగా కస్టమర్ల కాళ్లూ నడుములు కదులుతున్నాయి.

గుట్టుగా, అందరూ ఆశించినట్టుగా అటు ఫోకస్ లైటు ఆరిపోగానే ఇటు జీరో బల్బు వెలగడం ఒకేసారి జరిగాయి. జీరో వెలుతురు కిరణాలు హీరోయిన్ ఊర్వశి నాట్యాన్ననుసరిస్తున్నాయి.

ఊర్వశి కొత్త డాన్సర్. కొత్త డాన్సర్ ప్రోగ్రామంటే పాత కస్టమర్లు చేపలమడుగులో కొంగల్లా వాలిపోతారనేది హోటల్ యాజమాన్యానికి అనుభవైక వేద్యం.

ఇంతదాకా వచ్చాక ఇంకా ఈ వయ్యారి ఒంటిమీదనే ఉంటే చీలిక-పీలికలై పోతా మనే భయంతో మూరెడు-బారెడులు విడి పోబోతున్నాయి. నవనాగరికుల ఈలలు, వయసు మళ్లిన పురుష పుంగవుల కేరింతలు... మరో మొహంజదారో నాగరకత నాశ్రయించబోతున్నాయి.

ఫోకస్ లైట్లు... కళ్లు తెరిచేలోగా పోలీసు బృందం మెరుపుదాడి. అంతే... అసిస్టెంటు కమిషనరాఫ్ పోలీస్, నవయువకుడు నంద గోపాల్ నేతృత్వంలో రైడింగ్. ఎక్కడి వారక్కడనే..... గప్‌చుప్. చట్టాలను చుట్టజుట్టి చంకలో పెట్టుకునే వాళ్లందరికతడు సింహస్వప్నమని డిపార్ట్‌మెంటుకు తెలుసు... గుమ్మడికాయ ఎంత గట్టిదైనా కత్తిపీటకు లోకువే గదా! పోలీసాఫీసర్ సింహంలాంటి వాడైనా- ముడుపుల మూటకి పట్టువిడుపులుంటాయనేది హోటల్ యాజమాన్యం గతానుభవం.

రైడింగ్‌లో రెడ్‌హాండెడ్‌గా పట్టుబడిన పిట్టలన్నీ బెయిల్ రెక్కలు విప్పుకుని రాత్రికి రాత్రే ఎగిరిపోయినై. లాకప్ సెల్లో చివరకు మిగిలింది ఊర్వశి మాత్రమే.

బిక్కుబిక్కుమంటూ ఓ మూలన ఒదిగి కూచుంది. వయసు పొంగుల హంగులే కాని శిల్పసౌందర్యం చెప్పుకోదగింది కాదు. ఆమె ఒంపు సొంపుల్ని ఒడుపుగా జుర్రుకో

వాలనుకున్న పరువుగల పురుష ప్రముఖుల కెవ్వరికీ ఆమె గుర్తుకు రాలేదు. హోటల్ యాజమాన్యం పోతేపోయిందిలే అనుకుంది... చేతులు దులుపుకుంది.

పొద్దున్నే వాకింగ్ నుంచి తిరిగొస్తున్న ఎ.సి.పి. నందగోపాల్ స్టేషన్‌లో ప్రవేశించాడు. ముందున్న లేడీ కానిస్టేబుల్ సెల్యూట్ చేసింది. మగ కానిస్టేబుల్ మందహాసం కుర్చీ చూపించింది. మరో కానిస్టేబుల్ చేతులు కట్టుకుని రామభక్త హన్మాన్‌లా ఎ.సి.పి. ముందు నుంచున్నాడు.

"ఆ ఊర్వశి గురించి ఎవరూ రాలేదా?" కుర్చీలో కూచుంటూ అడిగాడు. చూపులుగోడకు వేళ్లాడుతున్న గాంధీ బొమ్మమీదున్నాయి.

"లేద్సార్. ఆమెకెవ్వరూ లేరట"

అదెలా! నాట్యమయూరికి నా అనేవారే లేరా! ఆశ్చర్యం.

"ఆమెతో మాట్లాడాలి"

"పిల్చుకురావాలా సార్?"

"వద్దు. వెళ్ళి చెప్పు. నేనే వస్తానటు"

కానిస్టేబుల్ లాఠీ లాకప్ చువ్వల్నితీవిగా తడిమంది. కటిక నేలమీద పడుకున్న ఊర్వశి గబుక్కున లేచి కూచుంది. రాత్రంతా నిద్రలేమి కళ్లల్లో మంటలు రేపుతోంది. పోలీసు వ్యాను ఎక్కే ముందు నడుముకు చుట్టుకున్న చీరకొంగును భుజాలమీదుగా కప్పుకుంది. కళ్లు పైకెత్తి కానిస్టేబుల్ వైపు చూసింది.

'మా ఎ.సి.పి. గారొచ్చింద్రు. నీతో మాట్లాడ్తారట. ఆయన మంచోల్లకు మంచోడు చెడ్డోళ్లకు చండశాసనుడు. నీ సంగతంతా సారుకు చెప్పుకో"

లేచి నుంచిని చీర సర్దుకుంది. ముందుకొచ్చి తలవంచుకుంది. లోలోపల భయం, బెరుకు.... అయోమయం.

"మీదేవూరు? ఈ పరిస్థితి ఎందుకొచ్చింది?" ముందుకొచ్చి అడిగాడు నందగోపాల్. ఆవిడ నాపాదమస్తకం పరిశీలిస్తున్నాయతని చూపులు...

మేకప్ మిలమిలలు మాసిపోయిన మొహం వాడిపోయిన గులాబి పూవులాగుంది. చామనఛాయ, బాబ్డ్ హెయిర్... జాకెట్‌లేదు.. సన్నని చీరలోంచి మెరుపుల కట్ బ్రా కనబడ్తోంది.

"మీకు దండం బెడ్తా సార్. నన్ను వదిలి పెట్టకండి సార్. తొందరగ జైలుకు పంపించండి సార్". చేతులు జోడించింది.

పట్టుబడ్డ వాళ్లంతా పలుకుబడి నుపయోగించో, డబ్బులు చల్లో, కాళ్లావేళ్లా పడో... లాకప్ నుంచి బయటపడుతూంటే... ఈవిడేమిటో! ఇదో నాటకం కాదుగదా!

"ముందు నేనడిగిందానికి జవాబివ్వాలి."

"సరే సార్!" పైకెగిరిన బంతిలా తలపైకి లేపింది. రెండు కన్నీటి చుక్కలు. గాల్లోకెగిరి సెల్ చువ్వల మీద వాలినై. గండుతుమ్మెదల్లాంటి కళ్లు మేఘావృతాకాశంలా గున్నాయి. కొనకొంగుతో కళ్లద్దుకొంది.

"కరీంనగర్ జిల్లాలో మాదో ఊరు సార్. ఏపనీ చెయ్యకుండా తాగుడు కలవాటుపడ్డ మా నాన్న నేను చిన్నగున్నప్పుడే చచ్చిపోయిండు. అమ్మ బీడీలు చేస్తుండేది. నేనుగూడా అలు బడికి పోతూ ఇటు అమ్మకు ఆకు కత్తిరిస్తూ, బీడీలు కట్టలు కడుతూ సాయపడేదాన్ని. టెన్త్ దాకా మా ఊర్లోనే చదివిన. యస్సెస్సీలో ఫస్ట్‌క్లాసు వచ్చింది. మా అమ్మ సంతోషంతో పొంగిపోయింది. నేను డిగ్రీ చదివి ఏదన్నా. మంచి ఉద్యోగం చెయ్యాలని కోరుకున్నది. మా ఊరి పురోహితుడి కొడుకు ప్రభాకరశర్మ సాయంతో జగిత్యాల బి.సి. హాస్టల్లో సీటు దొరికింది. గవర్నమెంటు జూనియర్ కాలేజిల ఇంటర్ చదువుతున్న.

అప్పటివరకే ప్రభాకరశర్మ డిగ్రీ పూర్తిజేసి రాజకీయాలల్ల తిరుగుతున్నాడు. నాతోని మంచిగా మాట్లాడెటోడు. వారానికి రెండు సార్లు హాస్టల్‌కొచ్చి పలుకరించేవాడు.

ఇంటర్ ఫైనల్ పరీక్షలు రాయకముందే మా అమ్మకు తగని రోగమొచ్చి చచ్చిపోయింది. లోకమంతా చీకటికాకి లెక్క కనబడింది. నన్ను ఒంటరిదాన్ని చేసి అమ్మహాయిగా వెళ్లిపోయిందని గోడగోడున ఏడ్చిన. ప్రభాకరశర్మ అండగా నిల్చున్నడు. అమ్మ తరపున బంధువులెవ్వరూ లేరు. అమోమయంల పడిపోయిన.

"ఇప్పుడేం చెయ్యాలె? ఎట్ల బతకాలె?" నని ప్రభాకరశర్మ నడిగిన. అసలు కష్ట మంటే ఏమిటో అప్పుడే అర్థమైంది.

"నువు ధైర్యంగా ఉండు. నీకో ఉద్యోగం చూసి పెడ్తా." అంటూనే అతని చెయ్యి నా వీపు నిమిరింది. నా ఒళ్లు ఝల్లుమంది. వింతచేష్టకు విస్తుబోయిన. అతని సాయం లేకపోతే నా బతుక్కోదారి దొరకదు. ఏమి చెయ్యాల్నో నిర్ణయించుకునే లోగా ఆ చెయ్యి నా భుజం దాకా వచ్చింది. రోషాన్నంతా దిగమింగి దూరంగా జరిగిన.

"నాకుద్యోగమెట్లా దొరుకుద్ది? ఖర్చులగ్గూడా పైసల్లేవు."

"మీ అమ్మది బంగారు గొలుసుందిగదా. అది అమ్మేసి సిటీకి పోదాం. అక్కడ నీకుద్యోగమిప్పిస్తా. మహారాణిలెక్క బతకొచ్చు."

"అబ్బో! సిటీలనా?" నా గుండె దడదడమంది సిటీని నేను చూల్లేదు. నాకు భయం. వణికిపోయిన

"భయం గియం ఏమీ వద్దు." నా చెంపనిమురుతూ "అన్నింటికీనేనున్నాగదా! సిటీల నీకన్నీ చూపిస్తా. అక్కడున్న నా ఫ్రెండ్స్‌తో చెప్తా. ఒక్క సంవత్సరంలోగా నువు సిటీ మనిషివైపోతవు. సిటీ గురించి చిత్రవిచిత్రంగా చెప్తవు" అంటూ భుజాలందు కున్నాడు. మెల్లగా విడిపించుకుని దూరం జరిగిన. అతని మాటల్లోని ధైర్యమొచ్చింది.

"మరిగిట్ల నా మీద చెయ్యేస్తే ఎట్లా?" అని అడుగు తూంటే ఏదో సిగ్గు తొంగిచూసింది.

"ఆఁ దాందేముంది ఊర్మశీ! చెయ్యేస్తే అరిగిపోతవా, కరిగిపోతవా? కావాలంటే నువు గూడా నామీద చెయ్యెయ్." అని నవ్వాడు.

నా అనే వారెవ్వరూ లేని నాకాక్షణాన అతడో ఆపద్బాంధవుడిలా కన్పించిండు. చేతులెత్తి మొక్కాలన్పించింది. కళ్లల్లో వత్తులేసుకుని అమ్మ రాత్రింబగళ్లు బీడీలు చేసి నెలకొంత కూడబెట్టి చేయించుకున్న బంగారు గొలుసు అమ్మేసి అతని వెంట సిటీకొచ్చిన.

సిటీకొచ్చేసరికి రాత్రయింది. ఆటోల అతని పక్కన కూచ్చున్న. కొత్త లోకంలో కొస్తున్నట్టనిపించింది. ఏదో లాడ్జింగుల దిగినం. కడుపునిండా భోంచేసినం. అదే రాత్రి ఏవేవో మాయమాటలు చెప్పిండు. తన పక్కన పడుకొమ్మన్నడు. నీడలేని ఆడదాన్ని. అతన్నెదిరించి బయటికొస్తే ఎరగని గల్లీల మొరగని కుక్క లెక్కయిపోతది. నా బతుకు కుక్కలుచింపిన విస్తరైతది.

"గిట్లైతే ఎట్లా? నీ పక్కల పడుకున్నంక నన్నెవరు పెండ్లిజేసుకుంటరు?"

అప్పటికే వెన్నుపూసల సన్నని వణుకు ప్రారంభమైంది. ఆకలిపులి ముందు మేకపిల్లలాగైపోయిన.

"పిచ్చిదానా!" మేధావి లెక్కనవ్విండు. "ఎవరో ఎందుకు? నేను చేసుకుంట. నేను బాగలేనా?" కమ్మగా అడిగిండు. నాకంత కంటే మంచి మొగుడు దొరుకుతడా?

"మరి.... మీవోళ్లు ఒప్పుకుంటరా?" మంచ మ్మీద అతని పక్కన కూచుని అడిగిన.

"మా వోళ్లను నేను ఒప్పిస్తా. నేనుగూడా ఇక్కడికే వచ్చి ఏదన్నా వ్యాపారం చేస్తా." నామీద చేయ్యేసి నవ్విండు. అతడే నా పాలిట దేవుడనుకుని లొంగిపోయిన. తెల్లారి నన్నా లాడ్జిగ్ రూములనే ఉంచి అతడెక్కడో తిరిగి సాయంత్రమొచ్చిండు. రాంగనే

"నువ్వదృష్టవంతురాలివి ఊర్వశీ! నీకో మంచి ఉద్యోగం దొరకబోతుంది." అన్నడు. ఇద్దరం కలిసి భోజనం చేసినం. ఉన్నంతలో బాగా తయారైన. అప్పుడే ఇంటర్వ్యూకెల్దా మన్నడు.

ఆటోల బయలుదేరి మూడంతస్తుల మేడ ముందు దిగినం. ఆ మేడపైన గదిలో ఓ నడివయసాయనను చూపించి.

"ఇతడే మీ కంపెనీ యజమాని. ఇతని దగ్గరే నీ ఉద్యోగం" అని పరిచయం చేసిండు. లోలోపల సంతోషంగా ఉన్నా ఏదో అయోమయంగా ఉంది. "నేనిప్పుడేవస్తా. మీరు మాట్లాడ్తుండండి" అంటూ బయటికెళ్లిపోయిండు.

అక్కడున్న పెద్దమనిషి పేరుగుడా నాకు తెల్వదు. కాని.... నన్ను పేరుబెట్టి పిల్చిండు. నా ఊరూ, వివరాలు అన్నీ అడిగిండు. ఇంకేవేవో అడిగిండు. అన్నింటికి జవాబు చెప్పిన. గబుక్కున నా చెయ్యిబట్టి లాగిండు. అతని ఒడిల వాలిపోయిన. బలవంతంగా కౌగలించుకున్నాడు. కేక వెయ్యబోయిన నా నోరు మూసిండు.

"నిన్ను పదివేల రూపాయలకు కొనుక్కున్న" అనుకుంటూ నన్నాక్రమించుకున్నాడు. సింహం చేతిల చిట్టెలుకనైపోయిన.

నన్నక్కడే ఉంచి బయటికెళ్లేప్పుడు గదికితాళం వేసుకపోయేవాడు. నన్నాదుకునే వారెవ్వరూ లేరు. గదిల ఫోన్‌గూడా లేదు. "నాకు కంపెనీలు లేవు. మీ ఊరి ప్రభాకరశర్మ బద్మాష్‌గాడు. కాని నేను నీకు ఉద్యోగమిప్పిస్తా" నని గూడా చెప్పిండు. వారం రోజులు ఏడ్చుకుంటూ గడిపిన. ఆ తర్వాత నాకా హోటల్ల ఉద్యోగమిప్పిస్తనని తీసుకుయోయిండు. హోటల్ వాళ్ల దగ్గర ఎంత వసూలు చేసిండో ఏమోకాని నాకక్కడ రకరకాల డాన్సులు నేర్పించిండ్రు. అందరి ముందు డాన్సులు చేయించిండ్రు. గట్లనే గడుస్తుంది. కాని.. రాత్రికి... గిట్ల జరిగి పోయింది..." వెక్కి వెక్కి ఏడుస్తోంది.. గుండెలు ఎగిసిపడుతున్నై. ఏసీ.పీ. వైపు ఆశగా చూసింది.

ఏ.సీ.పి. నందగోపాల్ కంతా అర్థమైంది. వాలకం గంభీరమైంది, అంతరాళాల్లో సునామీ అలలు ఎగిసిపడినై.

"ఈమె నీ రోజే కోర్టుకు తీసుకెళ్లండి" కానిస్టేబుళ్లనాదేశించి హుందాగా వెళ్లిపోయాడు.

★ ★ ★ ★ ★

రంగులతోపాటు అన్ని హంగులు అమర్చుకున్న గవర్నమెంటాఫీసు... అసిస్టెంట్ కమీషనరాఫ్ పోలీసాఫీసు. ఆఫీసులో యస్సైలు, సీఐలు...పిల్లుల బారినుండి తప్పుకుంటున్న ఎలుకల్లా.. తిరుగుతున్నారు. ఎవరి పని గురించి వారు... ఎవరెవరితోనో సంప్రదిస్తున్నారు. చెవులు కొరుక్కుంటున్నారు. ఆర్డినరీ ఫైళ్లు అల్మైరాల్లో విశ్రాంతి తీసుకుంటున్నాయి. అర్జంట్ ఫైళ్ల పరుగులకు గుసగుసల బ్రేకులు పడిపోయినై. సంచలన వార్త... వినీ విననట్టు, విషయం తెలిసీ తెలియనట్టు, అందరి మొహాలు గాంభీర్యాన్ని పులుసుకున్నాయి.

పుట్టిన్నాటి పుర్రెగుణం మేనమామకు తెలుసన్నట్టు- ఏ.సీ.పి. గారి వ్యక్తిగత విషయాలన్నీ క్యాంప్ క్లర్కుకు ఖచ్చితంగా తెలుస్తాయిని అందరికీ తెలుసు. ఏదో గుర్తకొచ్చినట్టు-ఎర్ర టోపీ తీసి బుర్ర గోక్కుంటూ అన్నాడొక యస్సై.

"పాలిచ్చే ఆవును పక్కనుంచుకుని దున్న పోతులనడిగితే పాలిస్తాయా? క్యాంప్‌క్లర్క్‌నే అడిగితే సరి."

సీనియరసిస్టెంట్ అమోదముద్ర పడింది.

బూట్ల టకటకలు, గుసగుసలు, మిసమిస లన్నీ క్యాంపు క్లర్కు చుట్టూ మూగాయి.

"ఇది నిజమేనా భాయ్?" సీనియరసిస్టెంట్ ప్రస్తావన.

తింటే గారెలె తినాలి, వింటే ఏ.సీ.పి. నందగోపాల్ వృత్తాంతమే వినాలి, అదీ తన ద్వారానే వినాలన్నంత ఉత్సుకతను పొత్తికడుపులో ఒత్తిపెట్టుకున్న క్యాంపుక్లర్కులో ఉత్సాహం ఉరకలేసింది. అతని చేతులన్న యమర్జెంటు ఫైలు- రెక్కలు తెగిన పక్షిలా టేబుల్ మీద వాలిపోయింది.

నేను చెప్పదలచుకున్నది, వీళ్లు అడగదలుచుకున్నదీ ఒకటేనా కాదా?.... అనుమానం... గోకింది.

"ఏదీ... ఏం సంగతీ?" ఏ.సీ.పీలా ఫోజిచ్చి కుర్చీకి జేరగిలబడ్డాడు. ఆఫీసనే నైమిషారణ్యములో తానో సూత మహర్షిలా.. వాళ్లంతా శౌనకాది మునుల్లా... ఫీలింగ్...

"అదే భాయ్... మన ఏ.సీ.పీ గారు ఆ బజారు ఆడదాన్ని....." కిసుక్కుమంటూ అడగబోయిన సీ.ఐ గొంతులో పచ్చి వెలక్కాయ ఇరుకున్నట్టైంది.

"బజారు ఆడదా? ఆమె ఎవరూ?"

'వీడో నంగనాచి, తుంగబుర్ర'. లోపల గొణుక్కున్నాడు సీ.ఐ. సీనియరసిస్టెంటు అడుగు ధైర్యంగా ముందుకు పడింది. తల ముందుకు వంగింది.

"అదేనయ్యా బాబూ!" ధైర్యాన్ని కూడగట్టు కోవడం కష్టమైంది. "అదే... ఆ ఫైవ్ స్టార్ హోటల్లో హాఫ్ నేకెడ్‌గా పట్టుబడిన డాన్సర్ ఊర్వశిని మన ఏ.సీ.పీ. గారీ రోజు రిజిస్టర్ మ్యారేజి చేసుకుంటున్నారటా!"

"హమ్మయ్య అదేనా!" క్యాంపు క్లర్కు కావాలనే నిట్టూర్చాడు "నిజమే... ఆ రోజు కోర్టులో ఆవిడ తరపున మన సారు వారే జరిమానా చెల్లించారు. ఆవిడకు హెచ్.ఐ.వీ. పరిక్షలు చేయించారు. ఊర్వశి అమ్మ వారికే రోగమూ అంటలేదని తేలిందట. మన ఏ.సీ.పీ. సారు మాటల మనిషి కాదు. చేతల మనీషి. అమ్మో, టైమైపోతుంది. ఓ గంటలో నేను రిజిస్ట్రార్ ఆఫీసులో ఉండాలి. సాక్షి సంతకం చెయ్యాలి" వేవబోయి కూచున్నాడు. "అన్నట్టూ... మనకీరోజు స్వీటు పార్టీ లభించబోతుందండోయ్" కుండబద్దలు కొట్టేసి- కొమ్మ మీది కోతిపిల్లలా కుర్చీలోంచిలో ఎగిరి గంతేసాడు ఎందుకైన మంచిదని ఊపిరి పీల్చుకుంటూ అందరి వైపు దృష్టి సారించాడు. జూనియరసిస్టెంట్ మీద దృష్టి నిలబడింది.

విషయాన్నంతా గ్రహించి వింతగా దిక్కులు చూస్తున్న ఓ హెడ్ కానిస్టుబుల్ తో "అంతా కలియుగ మాయ..." అంటున్న జూనియరసిస్టెంట్ శాస్త్రికేదో గుర్తుకొచ్చి నాలిక్కరుచుకున్నాడు. మింగలేక కక్కలేక, వ్యాఖ్యానం చేసేందుకు మాటలు రాక యస్సైలు, సీఐలు మొహాలు చూసుకున్నారు. వాతావరణం గంభీరంగా మారింది. ఆఫీసు స్టాపు తమ సీట్లనాక్రమించు కుంటున్నారు. అందరి వాలకాన్నోసారి అలవోకగా గమనించి తనలో తాను నవ్వుకున్నాడు. "అన్నట్టూ రిజిస్టర్ మారేజికి మన డి.ఐ.జీ. గారు గూడా హాజరవుతున్నారు సుమా!"

నేనేమీ ఎక్కువగా వాగలేదు. గదా... తనను తాను నెమరేసుకుంటే శాస్త్రి ఏదో ఫైలందుకున్నాడు.

★ ★ ★ ★ ★

"ఏయ్! విజయ పోరీ! చెడిపోయిన పోరికి వావి వరుసలేందే? మా నాయిన బతికుండంగ ఆయన పక్కల పన్నవు. ఇప్పుడీ దేవుడీకి నేనే దొరను. ఇప్పుడు నా పక్కన పడుకోవాలె. రా...రావే...." లోకాన్ని చీకటి కాకులు అలుముకుంటున్న సందేవేళ దొరబాబు దారుణం.

"ఓ ముండా! నీకు విజయ అని పేరెందుకు పెట్టింద్రటా, లంజ అని పెడ్తే బాగుండేది" మర్నాడు దొరబాబు పడుచు పెళ్లాం. దొర్సాని పళ్లు కొరుకుడు.

"మీ అమ్మ ఈ దేవుడీల దాసిగా ఉండేది. నీ తమ్ముణ్ణి బాగా చదివిస్తున్నవు. వాణ్నే పెద్దాఫీసర్ చేసి నువ్వో దొర్సానివైపోతవా ఏంది?" దొరబాబు వ్యంగ్య వచనాలు, కుతకుతలు.

"అరేయ్ గోపీ! నువు పట్నం హాస్టలుండి గవర్నమెంటు తిండి తింటున్నావు. పుణ్యాని కొచ్చిన బట్టలు తొడుక్కుంటున్నవు.. అంతా బాగానే ఉందిగానీ.. సదివి సదివి నువ్వేమన్నా రాజకీయం దందా చేసే దుందా? మన పొలంల పంజేసుకోరా" దొర్సాని ఉచిత సలహాలు, వేధింపులు.

"పాపం, ఫోనీ దొర్సానీ! వీడు బాగా సదువుకుని ఎటు వోతడు? మన దేవుడీలనే ఉంటడు. మన ఆస్తిపాస్తుల లెక్కలు రాస్తడు. పట్నంలున్న మన మిల్లుల సంగతులు చూస్తడు. టాక్సుల విషయాలు మాట్లాడ్తడు. గొర్రె బలిస్తే గొల్లోనికే నయమన్నట్టు వీడెంత సదివితే అంత మనకే లాభం గదా దొర్సానీ!"

వయసులోని శక్తియుక్తులన్నీ దేవుడీకి దారబోసిన ముసలి గుమాస్తా నారాయణ సముదాయింపు.

"ఒరేయ్ నందగోపాలా! ఖర్చుల విషయంల నువ్వేమీ వెనకా ముందాడకు. నేనున్నా గదరా. నువు ఐ.పి.యస్. కు ఆప్పీయరవు" ఆత్మీయ మిత్రుని అండదండలు.

'తమ్మీ గోపాల్! నీకు మంచి నౌకరి దొరుకుద్దట గదరా! నాకు ఖుషీగా ఉంది గానీ, నువు మల్లా ఈ దేవుడీలకు రావద్దురా". దేవుడీలో దొర స్నేహితుల చేతుల్లో నలిగిన అక్క విజయ అంతిమ ఘడియల్లో ఆరాటం. "నువు నాలాంటొళ్లకు సాయం చెయ్‌రా. కనీసం ఒక్క ఆడిదాన్నైనా ఆదుకోరా" చేతిలో చెయ్యి వేయించుకుంది... గతం కళ్లముందు కదుల్లోంది. రిజిస్ట్రార్ ఆఫీసులో పని పూర్తయాక ఊర్వశితోపాటు టాక్సీలో ఇంటికొస్తున్న నందగోపాల్ ఎద తృప్తిగా మూల్గింది.

కీచుమంటూ టాక్సీ ఇంటి ముందాగింది.

నిజామా! ఇదంతా నిజమే కావాలి... అమరిన అదృష్టాన్ని అంచనా వేసుకుంటూ ఊగిసలాడుతుంది ఊర్వశి మనసు.

"దిగు ఊర్వశీ! మనింటికొచ్చినం" భుజం తట్టాడు నందగోపాల్. ఊర్వశి ఊగిసలాట మాయమైంది.

రెండు నిండు జీవితాలను ముడేసిన గండలు మెడలో వేళ్లాడుతు న్నాయి. నూతన మధూవరులు కుడికాలుతో గడపదాటి బంగళా లోపలికొచ్చిరు. నందగోపాల్ వేలు పట్టుకుని అతని అడుగులో అడుగేసుకుంటూ నడుస్తుంది. ఊర్వశి. నేరుగా పూజ గదిలోకి తీసుకెళ్లాడు.

అతని మనసులాగే పూజ గది కూడా విశాలంగా ఉంది... అనుకుంది. ఊర్వశి. దేవీ దేవతల విగ్రహాల మధ్య ఓ మహిళఫోటో. ఆ పోటోకు పూలదండవేసుంది.

"ఊర్వశీ! ఈమె నా అక్క. పేరు విజయ. మేము తోడబుట్టాము కాని కూడి పెరగనివ్వని సమాజము మా అక్కను దాసీగా మార్చింది" ఫోటోకు నమస్కరిస్తూ తన్మయంగా చెబుతున్నాడు. నందగోపాల్. "మా ఊరి దొరదేవుడీలో మా అక్క నలిగి పోయింది. తాను మండుటెండలో కష్టాలనుభవిస్తూ నన్ను నీడల్లో ఉంచి చదివించిన మా అక్కను మించిన దేవతలెవరూ నాకు లేరు. చిన్నప్పుడు నన్ను ఎత్తుకుని ఆడించిన ఈ తల్లి ఆశయ సాధనలోనే నువు నా అర్ధాంగివైనావు"

"అవును.. నిజంగా విజయ వదిన దేవతనే. ఊర్వశి మానస సరోవరములో మురిపాల రాయంచలు రెక్కలు విప్పుతున్నాయి.

ఫోటో ముందు దీపం వెలిగించి నమస్కరించింది.

**విపుల - జూలై 2005**